# గూటి గువ్వలు

"పండ్లోయమ్మ పండ్లు ... అరటి పండ్లు, జాంపడ్లు, దానిమ్మ పండ్లు ..." జానపద స్వరము చెవిలో బ్రహ్మోపదేశంలా గింగురు మంటోంది. కాని... ఆమె కనబడుట లేదు.

బారెడు మీద జానెడెక్కిన పొద్దుతో పోటీ పడుతూ యుద్ధరంగానికెల్తున్న సైనికుడిలా నెత్తిమీద పండ్లగంపతో రోజూ కనిపిస్తూ, వినిపించే రాజవ్వ వారం రోజుల నుండి అజాపజా లేదు. వీధుల్లో పండ్లమ్ముకునే అనామకురాలి గురించి నాకెందుకులే అనుకుంటే, మొగుడిమాట పెడచెవిన పెట్టే పెడసరం పెళ్ళాంలా మనసు తిరగడుతోంది. ఆమెకేమయ్యుండొచ్చు ? నని ప్రశ్నిస్తోంది. దర్జాగా ఒరిగి కూచున్న పడక్కుర్చీ పాము పడగలాగన్పిస్తోంది. టీపాయ్ మీంచి ఎగిరి చేతుల్లోకొచ్చిన ఆరోజు పత్రిక ఇంకా రెక్కలు విప్పుకోలేదు.

బతుకు పోరాటంలో ఆరాటాలకు ఫుల్‌స్టాపు పెట్టుమంటూ రిటైర్మెంట్ ముంచు కొచ్చిందంటే ... జీవన సంధ్య తలుపు తడుతుందన్నట్టే గదా ! మనిషి చెయ్యని తప్పుకు మాధవుడు విధించే శిక్ష వృద్ధాప్యమని తెలుసు. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదనీ తెలుసు. కాని పాంచభౌతిక దేహం నుండి ప్రాణం పక్షి ఎగిరిపోయే దాకా కుక్కి మంచమ్మీద కుక్కిన పేనులా పడి ఉండొద్దనే ఆశయం రోజుకొక్కపూటన్నా పళ్లూ ఫలాలను ఆహారంగా స్వీకరించాలనే నియమాన్ని ఉపదేశించింది. నియమం సరిగ్గానే అమలవు తోంది. రోజూ రాజవ్వనే ఇంటికొచ్చి నాక్కావాల్సిన పళ్లు ఫలాలనందిస్తోంది. మా పరిచయం అంతటితో ఆగిపోలేదు. సంసారం సరిగమల్ని లోకం పోకడ పదనిసల్లో శృతి చేసి రోజూ కాస్సేపు ఆమెతో మాటలకచేరితో కాలక్షేపం అలవాటైంది.

"మనకున్నది ఇద్దరే పిల్లలు. వాళ్ళిద్దరికీ రెక్కలొచ్చి ఒకడు అమెరికాకు, ఇంకొకడు అహ్మదాబాదుకు ఎగిరిపోయిరి. లంకంత కొంపల లింగులిటుకుమంటూ ఇద్దరమే మిగిల్తిమి." గుర్తు చేసుకుంటూ గుండె చెరువు చేసుకుంటున్న మా భార్యాభర్తలకు కాలక్షేపం ఎంతో ఊరట నిచ్చింది.

నా వాటా పండ్లను గంపలో ఓ పక్కన బెట్టి, మిగతావి అమ్మేసి తిరిగ్గా మా ఇంటి కొస్తుంది రాజవ్వ. ఉప్పేసి, పొత్తుకూడినట్టు మా కచేరీలో మా ఆవిడ చాయగ్లాసు లందించి చల్లగా భాగస్తురాలవుతుంది. మాటల్లో మాట కలిపి నవ్వులో నవ్వై ఉల్లాసంగా గడిపేస్తుంది. ఈ వయసులో ఇంతకంటే ఇంకేం కావాలి ?

'రాజవ్వా ! వయసులో నువు నాకంటే చిన్నదానికి కాని వరుసలో పెద్ద దానివి. అనుభవజ్ఞురాలివి' అన్నానోసారి.

'దాందేముందన్నా ! బతుకు బాటల నడుస్తుంటే అనుభవాలు వాటంతటవే వస్తుంటయి గదా ! అంటూ నుదుటి స్వేదబిందువుల మీదాడుకుంటున్న రింగుల ముంగురుల్ని మునివేళ్ళతో సవరించుకుంది.

ఒడ్డూ పొడువు, కట్టూబొట్టూ మాటకొస్తే ఆమె సగటు భారత మహిళ. సువాసిని. తులసివనములో కలుపుమొక్కల్లా నల్లని జుట్టులో తెల్లని వెంట్రుకలు నుదుటి బొట్టు మీద నాట్యం చేస్తుంటే... ఆ దృశ్యం ప్రముఖ చిత్రకారుడు గీసిన చిత్రంలా కనువిందు చేస్తుంది.

ఫలాహారం తొలిరోజుల్లో రాజవ్వ జీవన నేపథ్యాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి అంతరంగ సముద్రంలోంచి సునామీలా పొంగుకొచ్చింది. సునామీ వరదల్లో ఆమె తడిసి ముద్దయింది.

"మేము వీరముష్టోళ్ళమయ్యా ! వెనకటి రోజుల్లో కోమట్ల దయా ధర్మాల మీద బతుకు బాటల నడిచినము. నాకు పదిహేనేండ్ల వయసు రాంగానే పెండ్లీడు పిల్ల ఇంట్ల ఉంటే నిప్పులకుంపటి నెత్తిమీద ఉన్నట్టేనని అమ్మా నాన్నలు ఆగమైపోయింగ్రు. గప్పుడే మా శంకరయ్య నా మెడల మూడు ముళ్ళేసిండు." బుగ్గలమీదో క్షణం సిగ్గులు ఇలా దోబూచిలాడి అలా మాయమైపోయినై. తుమ్మెద రెక్కల్లా కదుల్తున్న కనురెప్పల వెనకేదో కాచి వడబోసిన అనుభవముందని అర్థమైంది.

"వీరముష్టోళ్ళంటే వాళ్ళ కులవృత్తి ఏమిటి ?" కూచొమ్మని కళ్లతో సైగచేస్తూ అడిగాను. అప్పుడే మాకు వేడిచాయగ్లాసు లందించి నా భార్య నవ్వుతూ కూచుంది.

"అదో పెద్ద కథ అన్నా !" నాకోసం తెచ్చిన పండ్లను నా భార్య చేతికిచ్చి ఖాళీ గంపను ముందుకు జరిపింది. కొంగు నడుముకు బిగించి గంప ముందు కూచుంది. కృతజ్ఞతాభావం కళ్ళల్లో కదలాడుతూంటే చాయగ్లాసు పెదాల కానించుకుంది. వేడి చాయ నరాల్లో బరబరా పాకుతూ ఉత్సాహాన్నిచ్చింది.

"కోమట్లంటే వైశ్యులు గదా ! వైశ్యుల కులదేవత వాసవి కన్యకా పరమేశ్వరి. ఆమె అతిలోక సుందరి. ఆయమ్మ అందాలకు కండ్లు చెదిరి విష్ణువర్ధన మహారాజు పెళ్లాడ్తానన్నాడు. వాసవమ్మ తండ్రి కుసుమగుప్తుడు పెనుగొండ మహారాజు. ఆయమ్మ గానీ, తల్లిదండ్రులు గానీ ఆ పెండ్లికొప్పుకోలేదు. ఏమైనా సరే ఆమెను చెరపట్టి పెండ్లాడ్తానని విష్ణువర్ధనుడు పట్టుబట్టిండు. ఆయమ్మను ఇంకెవ్వరికీ కట్టబెట్టకుండా

చూసేందుకు వందలాది తన భటుల్ని పెనుగొండలో కాపలా పెట్టి తన రాజ్యానికి వెళ్ళి పోయిండు. వాసవమ్మ పార్వతీదేవి అవతారం గదా ! ఆమె మీద కన్నెయ్యడం తప్పు గదా ! ఆ దుర్మార్గం భటులెవ్వరికీ నచ్చలేదు. అందుకే వాళ్ళంతా కూడబలుక్కుని వాసవమ్మ భక్తులై పోయిండ్రు. వాళ్ళ రాజుకు ఎదురు తిరిగిండ్రు. వాసవమ్మ అగ్నిగుండంల దుంకేముందు ఆ భటులందర్నీ వీరముష్టులవాళ్లనీ, వాళ్ళను వైశ్యులే ఆదుకోవాలనీ చెప్పింది. అందుకు ఆ భటులంతా వీరముష్టోళ్లై వైశ్యులిస్తున్న దాన ధర్మాలతో హాయిగా బతికిండ్రు.

మొగోళ్లు గడ్డాలు, మీసాలు పెంచెటోళ్ళు. జేగంట మోగిస్తు పాటలు పాడుకుంట, ఆడుకుంట వాసవమ్మ కథ జెప్తుంటే కైలాసం నుండి పరమేశ్వరుని ప్రమదగణాలు దిగివచ్చి నట్టు ఉండేది.

రాను రాను కాలం మారింది. వృత్తి కళాకారులకు ఆదరణ తగ్గిపోయింది. అసలా కళలే మాయమైపోయినై. వీరముష్టోళ్ళ బతుకు కష్టమై పోయింది. జానెడు పొట్టకోసం కూలి – నాలి చేసుకోక తప్పలేదు. నా పెనిమిటి గంతులేసుకుంటూ, పాడుకుంట వాసవమ్మ కథ జెప్తుంటే జనాలు కంటతడి పెట్టేవారు. కథ వింటూ బొమ్మల్లెక్క కూకుండెటోళ్ళు. అంతటి కళాకారుడు కూటికి లేక పరేషానై పోయిండు. కొడుకును, కూతుర్ను, నన్ను గూడ వదిలేసి చెప్పాపెట్టకుండ కాశీపట్నం పోయిండు. మనసు ఆగమై దూదిపింజోలె ఎగిరిపోయినానని ఉత్తరం రాసిండు. ఫికరు చెయ్యొద్దని ఉత్తరాలు రాస్తూనే ఉన్నడు కాని మనిషి మాత్రం వస్తలేడు. తల్లి ముగ్గురం దిక్కులేని పక్షులమై పోయినం. పిల్లల ఆకలి చూపులు నా కడుపుల చల్లజేసినై. బీడీలు చేసుడు నేర్చుకున్న. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న. రాత్రనక, పగలనకా రెక్కలు ముక్కలు జేసుకొని బీడీలు చేసుకుంట పిల్లల్ని బడికి దోలిచ్చిన.

పిల్లల పట్టుదలకు ఆ సరస్వతమ్మ చల్లని చూపు తోడైంది. కష్టపడి చదువుకున్నరు. చెరువుల చాపపిల్లలోలె ముందుకు వోయిండ్రు. సర్కారు సాయంతోని కొడుకు డాక్టరు కోర్సు చదివి అమెరికాకు ఎగిరిపోయిండు. రెక్కలొచ్చి ఎగిరిపోతున్న పక్షులనెవరు ఆపుతరు ? వాడు అమెరికాకు పోయే ముందు పొగాకు వాసన పరేషాన్ జేసింది. బీడీల పనికి రాజీనామ చేసిన ఇరవయ్యేండ్లు ఆగకుండ కష్టపడి కూడబెట్టుకున్న ప్రావిడెంట్ ఫండ్ రూపాయలు చేతికి రాంగనే ఆడిపిల్ల పెండ్లి జేసిన.

అసలూ గీ కడుపు అనేది లేకపోతే మనిషికి కష్టాలే ఉండేటివి గాదు. నా ఒక్క పొట్ట కూటికైనా పంజేస్తేనే కడుపు నిండుద్దాయె. పొట్ట తిప్పలుకు జెర్రిపోతులాడించినట్టు

కొన్నేండ్లు తోపుడు బండిమీద కూరగాయలమ్మి కడుపు నింపుకున్న. కాని వయసు పెరిగిన కొద్ది ఓపిక తగ్గుముఖం పట్టింది. బండిని తోపుకుంట ఊరంతా తిరుగుడు చాత కాలేదు. అప్పట్నుంచి గీ పండ్లు అమ్ముడు షురుజేసిన, మోసేటన్ని పండ్లే గంపల వెట్టుకుని తిరుగు తున్న ..." మాటల్లో ఆత్మవిశ్వాసం, హావభావాల్లో స్వాతంత్ర్యం... కొట్టొచ్చినట్టు కనబడినై. బతుకు బాటలో నేనే విద్యార్థినై పోయిన.

"కొడుకు అమెరికాల డాలర్లు సంపాదిస్తున్నడు గదా ! నీకేమీ పంపించడము లేదా ? నీకెందుకీ శ్రమ ?" సూటిగా అడిగాను.

"శ్రమనా అన్నా ?" కనుబొమలు ఎక్కుపెట్టిన ధనుస్సులై పోయినై. నుదుటి గీతలు వంకర్లు తిరిగినై. నల్లని పెదాలమీద చిరునవ్వు మల్లెపూవులా విచ్చుకుంది. "కన్న కొడుక్కు చెయ్యిజాపుడు నాకిష్టం లేదన్నా. గీ సంసార సాగరంల వడి పెనిమిటి పారిపోయె, కాళ్ళూ రెక్కలాడుతున్నె. ఈ మాత్రం కష్టం జెయ్యకపోతే కాళ్ళూ చేతులు మూలకు పడిపోతై గదన్నా !"

"నీ పెనిమిడి కాశీపట్నంల ఉన్నడని తెలిసింది గదా ! అతనికి నచ్చజెప్పి ఇంటికి తీసుకొస్తే ..." గొప్ప సలహా ఇవ్వబోయాను.

"బలవంతాన లింగం గడితే భక్తుడైతడా ? పట్టిపట్టి పంగనామాలు పెడితే గోడచాటుకు వొయ్యి గోకేసుకున్నట్టు, పెండ్లాం పిల్లల్ని ఇడిచిపెట్టి ఫరారైపోయినోన్ని బతిలాడి పట్టుకొస్తే బలవంతుడైపోతడా ? అయినా దైవచింతనలున్నోడు. మోక్ష మార్గము దేవులాడుకుంటున్నాడేమో ? దానికి నేనెందుకు అడ్డం బోవాలన్నా" ముత్యాల ముక్కుపుడుక గమ్మతుగా మెరిసి నన్ను ఆలోచనలో పడవేసింది.

చతుర్విధ పురుషార్థాల్లో ధర్మం, అర్థం, కామం మూడు మాత్రమే భార్యాభర్తలు పంచుకునేవి. చివరిది మోక్షం. ఆ విషయంలో ఎవరి సాధన వారిదే. పుణ్యం పంచు కునేది కాదు. ఎవరిది వారు ఉంచుకునేది.

రాజవ్వతో కాలక్షేపం లేనినాడు ఏదో పోగొట్టుకున్న ఫీలింగు సతాయిస్తుంది.

ఓరోజు రాజవ్వ రాలేదు. మర్నాడు కారణమడిగాను. ఖాళీ గంప పక్కనబెట్టి, ఎడమ చెయ్యి గదవకానించి నాకెదురుగా కూచుంది.

"నిన్న మా పక్కింటి దుర్గవ్వకు జొరమొచ్చింది. పెయ్యి రొట్టెపెంక లెక్క కాలి పోయింది. ఆగమాగం జేసింది. రిక్షాల దవాఖానకు దీస్కపోయి డాక్టరుకు చూపించు కొచ్చిన. దాని మొగడు ఎర్రిబాగులోడన్నా, వట్టి భయంగొడ్డు. తనకే జొరమొచ్చినట్టు

వణుక్కుంట కూకున్నాడు. నేనే దగ్గరుండి టయానికి మందులిచ్చిన. రాత్రి గూడా అమె దగ్గర్నే కూచున్నా." గట్టిగా అవులించింది. తృప్తిగా కనరెప్ప లాడిస్తూ నా ఆమోదాన్నాశించింది.

"అవును పరోపకారాం పుణ్యం గదా ! చచ్చిం తర్వాత మనవెంట వచ్చేది అదేనాయె." అనగానే మరింత తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. గోదావరి ప్రవాహంలా గలగలా మాట్లాడే రాజవ్వ మరోరోజు విచారవదనంతో వచ్చింది. కళ్లు కుంచించుకు పోయినై.

"ఏమైందమ్మా ? జ్వరమొచ్చిందా ?" చూడగానే అడిగాను.

"కాదన్నా !" ఎడమ చెయ్యి నేలకానించి గోడకొరిగి కూచుంది. "అమెరికా నుండి నా కొడుకొచ్చిండు. ఒంటిగా కాదు, జంటగొచ్చిండు. వాన్ని అట్లా చూడంగనే నాకు గుండె ఆగినట్లైంది. అమెరికా పిల్లనే పెండ్లి చేసుకున్నడంటా. ఆ పిల్ల తెల్లకుందేలు లెక్కుంది. ఎంటికలు ఈరవోసుకుంది. మోకాళ్ళదాక గౌను తొడుక్కుంది. ఏం బాగలేదు. కన్నకొడుకు పెండ్లి కండ్లారజూడక పోతి. పచ్చని పందిట్ల కొడుకు కోడలు తలంబ్రాలు పోసుకుంటుంటే చూసి మురిసిపోవాలనుకుంటి. నా మురిపెం మూలకుపడె." పగటి కలువల్లా ముడుచుకు పోయిన కళ్ళల్లో నీళ్లూరినై, గొంతు జీరబోయింది.

పాపం రాజవ్వ ! కడుపున పుట్టిన వారి పెళ్ళి వేడుక కళ్లారా చూడాలని ఉవ్విళ్లూరుతున్న కన్నవారి ఆశల గురించి ఆ అప్రాచ్యునికేం దెల్సు ?

"అయిందేదో అయింది. కొడుకూ కోడలు చిలకాగోరెంకలోలె కండ్లముందున్నరు గదా !" సముదాయించబోయింది. నా భార్య.

"అంత అదృష్టానికి నోచుకోలేదమ్మా ! వాళ్ళు ఓ గంట సేపు కూడా నా కండ్ల ముందు లేరు. నా ఇంట్ల మంచినీళ్ళు గూడా తాగలేదు. కలల కనబడిపోయినట్లుంది. ఎన్ని రూపాయలు కావాలెనని అడిగిండు. కడుపుల కవ్వంబెట్టి చల్లజేసినట్లైంది. ప్రేమ లేని పైసలు నాకెందుకూ ? ఏమీ వద్దన్న ... "

"డాక్టరు గదా ! బాగానే సంపాదించి ఉంటాడు."

"వాడెంత సంపాదిస్తే నాకెందుకన్నా ? సంపాదించింది చాలు, ఇంగ ఇక్కడనే ఉండుమన్న. వాడసలే ఒప్పుకోలేదు. మల్లా అమెరికాకే పోతడటా. అక్కడనే ఉంటడటా! వాని కొడుకును అక్కడనే ఉంచి వచ్చిండటా, ఈ దేశం ఉప్పుదిని పైకొచ్చిండు గదా ! ఇక్కడి బీదా బిక్కిలకు వైద్యం జేసి ఋణం తీర్చుకోవద్దా అన్నా !" నోటికి కొంగు అడ్డం పెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది. కనుకొలుకు ల్లోంచి రాలిన బిందువులు కపోలాలను

తడిపేసినై.

నాకైతే ... కడుపులోని పేగుల్ని కరకర కోసినట్లని పించింది. ఈ మట్టిలో పుట్టి, ఈ దేశప్రజల డబ్బుల్తో పెద్ద చదువులు చదివి విదేశాల్లో శాశ్వతంగా స్థిరపడుతున్న మేధావులందరూ రాజవ్వలా ఆలోచిస్తే దేశానికెంతో మేలు జరుగుతుంది.

నాభార్య, నేను తెల్లబోయి మొహాలు చూసుకున్నాము. ఆ చూపుల్లో మన సుపుత్రుని సంగతేమిటనే భావం ప్రస్ఫుటించింది.

రోజు ఏవేవో కొత్త విషయాలు, లోకం పోకడలు, స్థానిక రాజకీయాలు మా కబుర్లకు ఇతి వృత్తాలు. "గ్రామ పంచాయితీ ఎన్నికలప్పుడు ఓటెయ్యమని నీకు ఏ పార్టీవాళ్ళు ఎంత ఇచ్చింద్రు ఓటుకోసం", నవ్వుతూ అడిగాను. అందుకామె మొహం గంభీరంగా మారింది. గోడకొరిగి కూచున్నదల్లా ముందుకు జరిగింది.

"ఛీపాడు గదన్నా !" బూతుమాట విన్నట్టు చెవులు మూసుకుంది. కాండ్రించి ఉమ్మేసినంత పంజేసింది. "పైసల్తీసుకుని ఓటేస్తే పాపం గదన్నా ! అయినా పైసలు పంచి గెల్చినోల్లు పైసల సంపాదనల పడ్తరు గాని ప్రజాసేవ చేస్తరా ? పైసలో, చీరెనో తీస్కని ఓటేసినోల్లకు అటెన్క వాళ్లనేమన్నా అడిగే ధైర్యముంటుందా ?" నిలదీసినంత పని జేసింది. నానోట మాట రాలేదు.

తన పెళ్ళిలో వాళ్ళ అత్తమ్మ ప్రేమగా మెడలో వేసిన బంగారు గొలుసును కార్గిల్ యుద్ధమప్పుడు రక్షణ నిధి కిచ్చిందట. ఆ విషయం చెబుతున్నప్పుడు ఆమె మొహంలో ఆనందం తాండవించింది.

అలాంటి రాజవ్వకేమైందో ... ఎందుకు రావట్లేదో ఎవరినడుగుదామన్నా... ఆమె గురించి ఎవరినడగాలనేది అర్థం కాలేదు.

ఇందుగలదందులేదని సందేహము లేదు. అన్నట్టుగా సర్వవ్యాప్తమైన చికెన్ గున్యా జ్వరం సోకిందేమో ! డాక్టర్లు, యాక్టర్లు, సామాన్య అసామాన్య జనాలందరినీ ముప్పుతిప్పలు పెడుతున్న జ్వరం ఆమెను గూడా వదిలిపెట్ట లేదేమో అనేందుకు గట్టి ఆధారముంది.

ఈ మధ్య వాళ్ళ ఎదురింటి వాళ్ళంతా అదే జ్వరంతో బాధపడ్తూంటే రాజవ్వనే వైద్యుణ్ణి తీసుకెళ్ళి మందులిప్పించిందట. అంతేకాదు వాళ్ళింట్లో వంటగూడా తానే చేసి పెట్టిందంటా. కాబట్టి దయాదాక్షిణ్యాలు లేని తెల్లటైగర్ దోమ రాజవ్వ రక్తాన్ని గూడా రుచి చూసిందేమో ! చికెను గున్యా వీరంగాన్ని స్వయంగా అనుభవించాను కాబట్టి దాని గురించి నాకు బాగా తెలుసు. గోలుకుని వారంగూడా కాలేదు. ఆవహించిన

నీరసాన్ని గరం చాయతో తరిమెయ్యాలనే ప్రయత్నంలో పడక్కుర్చీలో ఒరిగాను. కదిలించిన తేనెతుట్టిలా ఆమె ఆలోచనలే చుట్టుముట్టాయి.

"పేపర్ అట్లా చదవడమో ఫ్యాషనా లేక సరికొత్త సాధననా ?" శ్రీమతి చాయ గ్లాసుతో ప్రత్యక్షమైంది.

చైతన్యం చేతుల్లోకొచ్చి పైకి లేచినై. నిజమే. వార్తా పత్రిక తలకిందుగా ఉంది. చికెన్ గున్యా చెరలో అనుభవించిన శిక్షకు రాజవ్వ ఆలోచనలు తోడై మరో లోకానికి తీసుకెళ్ళినై... నాలో నేనే నవ్వుకుంటూ పేపర్ టీపాయ్‌మీద పడేశాను.

"ఫ్యాషన్ కాదు, ప్రయోగం కాదు గానీ... పండ్ల రాజవ్వ పత్తాలేక వారం దాటింది గదా !" వేడిచాయ వాడిగా నరాల్లోకి పాకి ఉత్సాహాన్నిచ్చింది.

"అదా సంగతి ?" గుండెల మీద చెయ్యేసుకుంది. "మనందరికొచ్చిన చికెన్ గున్యా ఆమెగ్గూడా వచ్చిందేమో !" ఖాళీ చాయగ్లాసు నీరసంగా అందుకుంది.

నేను గూడా అదే అనుకుంటున్నా ... నామాట పూర్తవలేదు.

"మీరేమనుకుంటుండ్రో నాగ్గూడా చెప్పుండ్రన్నా !"

ఆశ్చర్యం .... అమితానందం, గుమ్మంలో రాజవ్వ ...

ఎర్రపూలు అద్దిన పెసరిరంగు పట్టుచీర. మొహం నిండా సాయపసుపు రాసుకుందేమో, విరబూసిన గుమ్మడిపూవులాగుంది. పున్నమి చంద్రుడిలా ఎదిగిన నుదుటి కుంకుమబొట్టు ఉదాత్తంగా ఉంది. కాటుక దిద్దిన కళ్ళతో అచ్చం... అమ్మవారి లాగుంది. చేతుల్లో పండ్ల గంప లేదు. ముడతలు సంతరించుకోబోతున్న బుగ్గలమీద నునులేత సిగ్గుల ఛాయలు కొత్తగా కన్పించినై.

ప్రత్యక్షమైన పార్వతీదేవిని కన్నార్పకుండా చూస్తున్నట్టు నా భార్య కొయ్యబారిపోయింది.

"గట్లా చూస్తున్నరేందయ్యా !" తాబేలులా ముడుచుకుపోయింది. ఆశ్చర్యంలోంచి తేరుకుని మరోసారి మేము మొహాలు చూసుకున్నాము.

"ఈరోజు ఏం పండ్లు దెచ్చినవ్ ?" కూచొమ్మని కళ్ళతో సైగ చేస్తూ శ్రీమతి అడిగింది.

ఒకరినొకరు కొత్తగా చూసుకుంటూ ఇద్దరూ పక్కపక్కన కూచున్నారు. రాజవ్వలోని కొత్తదనానికి కారణమేమిటో !

"పండ్లు ఇక్కడికి తేలేదమ్మా! మీరే మా పండ్ల దుకాణానికొచ్చి కొనుక్కోవాలె." కొంగు భుజాలనిండా కప్పుకొంది.

"మీ దుకాణమా !" నోరెల్లబెట్టాను.

"అవునన్నా !" పట్టుచీర కొంగు ఓ పట్టాన నిలువనంటుందేమో, దాన్ని బొడ్లో కుక్కేసింది. "నా పెనిమిటి శంకరయ్య కాశీనుండి వచ్చేసిండు. ఈ బెనారసు పీతాంబ్రము ఆయన తెచ్చిందే. రోజూ కాశీవిశ్వనాథుణ్ని కండ్లారా చూసిండట. అక్కడికి పోయినంక మొదట ఓ దుకాండ్ల గుమాస్తాగా పంజేసిండట. సొంత యాపారం షురూ జేసి బాగానే సంపాదించిండటా. ముసలితనమొచ్చి ముంగిట్ల నిల్చుంది గదా ! ఇప్పుడన్నా ఆలుమొగలం కలిసుంటే ఒకలకొకలం సాయమనుకున్నడటా. తాను తినంగ మిగిలింది తీసుకొచ్చిండు. పెద్ద బజార్ల పండ్ల దుకాణం పెడుతున్నం. అంతా తయారైంది. ఇయ్యాల్ల మధ్యాహ్నం పూజ. మీరు తప్పక రావాలన్నా !" చేతిలోని కుంకుమబరిణ విప్పి మావిడకు బొట్టుపెడుతూ "నువుగూడా తప్పక రావాలమ్మా" అంది.

"అయితే నీ పెనిమిటి తిరిగి సంసార జంఝాటములో పడిపోతుండన్న మాటా. అందుకు కాశీవిశ్వనాథుడు ఒప్పుకున్నాడా ?" కావాలనే అడిగాను.

నీలమేఘశ్యామల పెదాలమీదో చిరునవ్వు మబ్బుల్లో మెరుపులా కనబడింది. లేచి నుంచుంది.

"కాశీవిశ్వనాథుడైనా, కైలాసములున్న శివుడైనా ఆలుమొగల్ని విడిపొమ్మంటడా? సంసారం చేసుకోవద్దంటాడా అన్నా ? పొట్టకూటికోసం ఏ పంజేసినా ధర్మం తప్పొద్దంటడు. ఎంత సంపాదించిన న్యాయం పాటించాలంటాడు. గంతే కదన్నా !"

ఇంతకంటే బ్రహ్మసూత్ర మింకేముంటుంది ? జతగూడినదాన్ని పిల్లల్ని గూటిలో వదిలేసి పొద్దున్నే ఎగిరిపోయిన గువ్వ సాయంత్రానికి ఆహారంతో గూడు చేరిందన్న మాట. అలాగే రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోయినై. గూటిలో గువ్వల జంట మిగిలింది.

*(మూసి మాసపత్రిక, జనవరి, 2007)*